సాక్షి చిత్తూరు

మంగళవారం। 8। అక్టోబర్। 2024



మా మొర ఆలకించండి సారూ !

చిత్తూరు కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 127 వినతులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. - 10లో



గ్రామీణ ప్రగతికి ఆత్మనిర్భర్

గ్రామీణ ప్రగతికి ఆత్మనిర్భర్ భారత్ ఎంతో తోడ్పాటునందిస్తుందని ఆత్రియా ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు. - 10లో



కుట్టుమిషన్ల పంపిణీ

కుట్టుమిషన్లు అందుకున్న మహిళలు ఆర్థిక అభివృద్ధి సాధించాలని అసిస్టెంట్ కలెక్టర్ హిమవంశీ ఆకాంక్షించారు. - 10లో

న్యూస్‌రీల్

రేపు విద్యుత్ గ్రీవెన్స్

చిత్తూరు కార్పొరేషన్: ఉమ్మడి జిల్లాలోని అన్ని డివిజన్ కార్యాలయాల్లో బుధవారం విద్యుత్ గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ట్రాన్స్‌కో ఎస్‌ఈ సురేంద్రనాయుడు తెలిపారు. ఆ రోజు ఉదయం 11 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. వినియోగదారులు విద్యుత్ సమస్యల పై ఫిర్యాదు చేయవచ్చని వివరించారు.

స్టోర్స్‌కు చేరిన పరికరాలు

ఉమ్మడి జిల్లా ట్రాన్స్‌కో స్టోర్స్‌కు విద్యుత్ పరికరాలు వచ్చినట్లు ఎస్‌ఈ సురేంద్రనాయుడు తెలిపారు. ఈ మేరకు సబ్‌స్టేషన్లలో ఉపయోగించే వీసీబీ బ్రేకర్లు 13 రాగా, 11 కేవీ పిన్స్‌లేటర్లు 5వేలు, 11 కేవీ డిస్కులు 5వేలు వచ్చినట్లు వివరించారు. ఏఈలు వర్క్‌ఆర్డర్లు పెట్టి మెటీరియల్స్ తీసుకోవాలని సూచించారు.

ప్రజా ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో విచారణ



ప్రజల సమస్యలు వింటున్న ఎస్పీ మణికంఠ

చిత్తూరు అర్బన్: ప్రజల నుంచి వచ్చే సమస్యలను పరిష్కరించడంలో అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టాలని చిత్తూరు ఎస్పీ మణికంఠ అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్) కార్యక్రమానికి 42 ఫిర్యాదులు అందాయి. చిత్తూరు నగరంలోని ఆర్మ్‌డు రిజర్వు (ఏఆర్) కార్యాలయంలో ఎస్పీ మణికంఠ చందోలు ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. ఇందులో కుటుంబ తగాదాలు, వేధింపులు, డబ్బు తగాదాలు, భూ తగాదాలు, ఆస్తి తగాదాలకు సంబంధించిన ఫిర్యాదులు ఉన్నాయి. వచ్చిన ప్రతి ఫిర్యాదుపై క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి వాటిని పరిష్కరించాలని అధికారులను ఎస్పీ ఆదేశించారు. వీటిని ఆన్‌లైన్‌లో సైతం నమోదు చేయాలని సూచించారు.

కల్పవృక్ష వాహనంపై విహరిస్తున్న శ్రీవారు



ఓ పక్క రుక్మిణి.. మరో పక్క సత్యభామ నడుమ వేణుగోపాలుడు భక్తులకు కనువిందు చేశారు. స్వర్ణతేజోమయంగా కాంతులీనుతున్న సర్వభూపాల వాహనాన్ని అధిరోహించిన కాళీయమర్దనుడు.. సకల భూపాలురకు తానే అధిపతినని.. తన భిక్షే రాజ్యాధికారమని సందేశమిచ్చారు. తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం మలయప్పస్వామికి ఉదయం కల్పవృక్షవాహన సేవ, రాత్రి సర్వభూపాల వాహనసేవ వైభవంగా నిర్వహించారు. శ్రీవారిని దర్శించుకున్న భక్తజనం కర్పూర నీరాజనాలు అందించి పులకితులయ్యారు.

- సర్వభూపాల వాహనంపై మలయప్పస్వామి విహారం
- నేటి సాయంత్రం 6.30 గంటలకే గరుడ వాహన సేవ
- శ్రీవారికి శ్రీవిల్లిపుత్తూరు పుష్ప మాలలు, చెన్నై గొడుగుల సమర్పణ



కేరళ వాయిద్య కళాకారులు



గరుడసేవకు ముస్తాబైన తిరుమల వేంకటేశ్వర స్వామి ఆలయం

కృష్ణాలంకృతుడై.. తృష్ణవల్లభుడై..



సర్వభూపాల వాహనంలో ఊరేగుతున్న మలయప్పస్వామి

తిరుమల: తిరుమలేశుని వార్షిక బ్రహ్మోత్సవాలు కోలాహలంగా సాగుతున్నాయి. నాలుగో రోజు సోమవారం ఉదయం కల్పవృక్షవాహనం, రాత్రి సర్వభూపాల వాహనంపై ఉభయ దేవేరులు శ్రీదేవి, భూదేవితో సమేత మలయప్పస్వామి పురవీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. భూపాలురందరికీ తానే భూపాలుడినని చాటుతూ శ్రీవారు సర్వభూపాల వాహనంపై కొలువుదీరారు. సంధ్యా సమయాన ఆలయం వెలుపల ఉన్న కొలువు మంటపానికి స్వామివారిని వేంచేపు చేశారు. అనంతరం సహస్ర దీపాలంకార సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవమూర్తులు వేయి నేతి దీపాల వెలుగులో ఊయలపై ఊగుతూ భక్తులకు కనువిందు చేశారు. అనంతరం బంగారు, వజ్రవైఢూర్య ఆభరణాలు, పుష్ప మాలలతో ఉత్సవర్లకు విశేష అలంకరణ చేసి సర్వభూపాలవాహనంపై కొలువుదీర్చారు. అశేష భక్తజనం గోవిందనామస్మరణలు, మంగళ వాయిద్యాలు, వేద మంత్రోచ్చారణ నడుమ రాత్రి 7 గంటలకు ప్రారంభించిన సర్వభూపాల వాహన సేవ రాత్రి 9 గంటల వరకు నాలుగు మాడ వీధుల్లో సాగింది. కళాకారుల ఆధ్యాత్మిక ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి.



6.30కే గరుడ సేవ

తిరుమల: బ్రహ్మోత్సవాల్లో విశిష్టమైన గరుడ వాహన సేవ మంగళవారం సాయంత్రం 6.30 గంటలకే ప్రారంభించనున్నారు. ఇందుకోసం టీటీడీ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. తొలి నాలుగు రోజులు వాహన సేవల్లో జనం పలుచగా కనిపించారు. గరుడ వాహన సేవకు రెండున్నర లక్షల మందికిపైగా భక్తులు హాజరయ్యే అవకాశాలున్నాయని టీటీడీ అధికారులు భావిస్తున్నారు. ఇందులో భాగంగా ఆలయం చుట్టూ నిర్మించిన ఇన్నర్ సెక్యూరిటీ కారిడార్‌కు చెందిన మొత్తం 27 ప్రవేశాలు, వెలుపల మార్గాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఉత్సవాల్లో ఇప్పటికే 5,145 మంది భద్రతా సిబ్బందిని నియమించారు. రాత్రి 6.30 గంటలకే గరుడ వాహనసేవను ప్రారంభించి రాత్రి 11 గంటల వరకు నిర్వహించేలా ఏర్పాట్లు చేశారు. తిరుమలలో ట్రాఫిక్ నిబంధనలు మరింత కఠినం చేశారు. సోమవారం నుంచే తిరుమల రెండో ఘాట్‌రోడ్డులో ద్విచక్ర వాహనాల రాకపోకలను నిషేధించారు. తిరుపతిలో పలు ప్రాంతాల్లో పార్కింగ్ ఏర్పాట్లు పోలీసులు చేశారు.

జేసీబీతో ఇసుక తవ్వితే కఠిన చర్యలు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో జేసీబీ సాయంతో ఇసుకను తవ్వితే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ హెచ్చరించారు. ఆయన సోమవారం కలెక్టరేట్‌లో మీడియాతో మాట్లాడుతూ పకడ్బందీగా ఉచిత ఇసుక పంపిణీ విధానం అమలు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో ప్రస్తుతం 88,530 మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉందన్నారు. ఇందులో 9,382 మెట్రిక్ టన్నుల ఇసుక బీఎస్‌ఆర్‌పేట, పాలారు స్టాక్ యార్డ్‌లో 79,148 మెట్రిక్ టన్నులు ఉందని వివరించారు. ఇసుక రవాణా చార్జీలు మాత్రం చెల్లించాలని చెప్పారు. ఇప్పటి వరకు 92 వేల మెట్రిక్ టన్నుల ఇసుకను విక్రయించినట్లు పేర్కొన్నారు. ఇసుక అక్రమ రవాణా కట్టడికి పూర్తి చర్యలు చేపడుతున్నామని చెప్పారు. ఎవరైనా అక్రమంగా ఇసుక రవాణ చేస్తే టోల్ ఫ్రీ నెంబర్ 08572–299509కు సమాచారం ఇవ్వాలన్నారు. జిల్లాలో కమ్యూనిటీ పనుల నిమిత్తం గ్రామస్తులు యంత్రాల సాయంతో కాకుండా స్వయంగా ఇసుకను తీసుకెళ్లవచ్చన్నారు. ఇందుకోసం జిల్లాలోని 20 మండలాల్లో 44 గ్రామాల్లో రీచ్‌లను గుర్తించినట్లు తెలిపారు. గత 45 రోజుల్లో 6 వాహనాలను సీజ్ చేసి రూ.3,60,000 జరిమానా విధించినట్లు వివరించారు. ఈ విలేకరుల సమావేశంలో ఎస్పీ మణికంఠ, జేసీ విద్యాధరి, అసిస్టెంట్ కలెక్టర్ హిమవంశీ, మైన్స్ డీడీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

హైకోర్టు ఆదేశాలు బేఖాతర్

సాక్షి టాస్క్‌ఫోర్స్: సీఎం చంద్రబాబు నాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గంలో సంఘమిత్రలు రోడ్డెక్కారు. రామకుప్పం మండల పరిధిలో వెలుగు సమాఖ్యలో సంఘమిత్రలుగా పనిచేస్తున్న 32 మందిని అధికారులు నిష్కారణంగా విధుల నుంచి తొలగించారు. దీంతో సంఘమిత్రలు రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. నోటీసులు జారీచేయకుండా అకారణంగా సంఘమిత్రలను తొలగించరాదంటూ హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది. వారిని యథావిధిగా విధుల్లో కొనసాగించాలని పేర్కొంది. ఈ క్రమంలో ఆదివారం రామకుప్పం గ్రామ సచివాలయంలో జరిగిన వెలుగు సమాఖ్య సమావేశంలో సంఘమిత్ర గాయత్రి పాల్గొనగా అధికార పార్టీ నేతలు అభ్యంతరం వ్యక్తంచేశారు. తమను సంఘమిత్రలుగా కొనసాగించాలని హైకోర్టు ఉత్తర్వులు జారీచేసినట్లు నేతల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకపోయిందని గాయత్రి వాపోయారు. వెలుగు సమాఖ్య ఆధ్వర్యంలో గ్రూపు సభ్యులు, సంఘమిత్రలు స్థానిక సచివాలయం ఎదుట హైకోర్టు ఉత్తర్వులను అమలుచేయాలని కోరారు. ఇరువర్గాల మధ్య వాగ్వావాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలో గాయత్రి భర్త కృష్ణప్రసాద్‌పై అధికార పార్టీ కార్యకర్తలు దాడికి పాల్పడినట్లు ఆమె రామకుప్పం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇరు వర్గాలు ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకున్నాయి. టీడీపీ నేతలు కావాలనే ఉద్దేశపూర్వకంగా తమపై కక్ష సాధింపులకు పాల్పడుతున్నారని హైకోర్టు ఉత్తర్వులను వెంటనే అమలుచేయాలని ఈ సందర్భంగా సంఘమిత్రలు కోరారు.



సచివాలయం ఎదుట నిరసన తెలుపుతున్న సంఘమిత్రలు

లిక్కర్ టెండర్!

''రేయ్, యాదమరి బోర్డర్‌లో ఉన్న దుకాణానికి ఎవర్ని అడిగి అప్లికేషన్ పెట్టావు. వినుకో, లాటరీలో ఆ షాపు నీకు వచ్చినా, అది నాదే లెక్క. అక్కడ వ్యాపారం నువ్వు చేయకూడదు. కాదు, కూడదు అన్నావా, పది రోజుల్లో దుకాణంలో కర్ణాటక లిక్కర్ పెట్టి నిన్ను బొక్కలో తోయిస్తా. ఖబడ్దార్..!''

- మద్యం వ్యాపారితో ఓ టీడీపీ ప్రజాప్రతినిధి ఫోన్ కాల్

'' ఎంత ధైర్యం యా నీకు, మా నియోజకవర్గంలో మా పర్మిషన్ లేకుండా, ఎక్కడో కడప నుంచి వచ్చి అప్లికేషన్ పెడతావా? అప్లికేషన్ వేసేటప్పుడు మమ్మల్ని అడగలేదు. వేసినాకైనా వచ్చి కనబడాల కదా. సరే ఇంకెవరూ అప్లికేషన్ వేయకుండా నేను చూసుకుంటా. నీకు షాపు వచ్చినట్టే. వ్యాపారంలో క్వార్టర్‌పై రూ.15 ఎక్కువ పెట్టి అమ్ముకో. రూ.5 నీకు, రూ.10 మాకు. నీకొచ్చే దాంట్లోనే డిపార్టుమెంటు అంతా చూసుకో. కాదంటే చెప్పు మా వాళ్లు రెడీగా ఉన్నారు.

- గంగాధరనెల్లూరులో ఓ ప్రజాప్రతినిధి సోదరుడు ఇలా.

'' సార్, నగరిలో రెండు దుకాణాలకు అప్లికేషన్ వేస్తే స్థానికంగా ఉన్న ఓ టీడీపీ నాయకుడు మనుషుల్ని మా ఇంటి వద్దకు పంపించాడు. లాటరీలో షాపు వస్తే వదిలేయాలన్నారు. నాకు ఖర్చయిన రూ.4 లక్షలు ఇచ్చేయమని అడిగాను. ఒక్క రూపాయి కూడా ఇవ్వం. ఎవర్ని అడిగి అప్లికేషన్ పెట్టావు అని నన్ను కొట్టబోయారు. ప్రాణాలతో ఉండాలా..? రూ.4 లక్షలు కావాలా..? అని బెదిరిస్తున్నారు. నన్ను మీరే కాపాడాలి.''

- రాష్ట్ర ఎక్సైజ్ శాఖ అధికారికి ఓ బాధితుడి ఫోన్

జిల్లాలో మద్యం దుకాణాల నిర్వహణ కోసం జరుగుతున్న దరఖాస్తుల ప్రక్రియ ఏ మేరకు అలజడి సృష్టిస్తుందో వ్యాపారులకు వచ్చిన బెదిరింపు ఫోన్ కాల్సే సాక్ష్యం. ఇన్నేళ్లు ప్రతిపక్షంలో ఉన్నాం, ఇప్పుడు అధికారంలోకి వచ్చాం. తమ ఆకలికి అడ్డేదీ ఉండకూడదంటూ కొందరు టీడీపీ నేతలు మద్యం దుకాణాల టెండర్లలో తలదూరుస్తున్నారు. ఇప్పటికే ఉన్న ప్రభుత్వ మద్యం దుకాణాలకు మంగళం పాడిన సర్కారు వేలాది మంది నిరుద్యోగుల పొట్టకొట్టి వారి ఉసురు పోసుకుంది. తాజాగా ఈ దుకాణాల నిర్వహణలో తాము చెప్పిందే జరగాలంటూ టీడీపీ నేతలు బరితెగిస్తుండడం అటు పార్టీ పరువును బజారున పడేస్తుండగా, ప్రభుత్వ ఖజానాకు భారీగా గండిపడుతోంది.



- మద్యం వ్యాపారులకు 'పచ్చ' బెదిరింపులు
- టెండర్లు వేసినా దుకాణం లాక్కుంటామని హెచ్చరికలు
- రేపే ఆఖరు.. ప్రభుత్వ ఖజానాకు అధికార పార్టీ నేతల గండి

చిత్తూరు అర్బన్: ప్రభుత్వ ఖజానాకు గండికొడుతూ, టీడీపీ నేతలు సొంత లాభమే ధ్యేయంగా మద్యం పాలసీ వ్యవహారాన్ని నడిపిస్తున్నారు. జిల్లాలో ప్రైవేటు మద్యం దుకాణాల నిర్వహణ కోసం ఎక్సైజ్ అధికారులు ఇప్పటికే నోటిఫికేషన్ జారీ చేశారు. ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తు చేసుకునే అవకాశం పెట్టడంతోపాటు ఆసక్తి ఉన్న వాళ్లు దరఖాస్తు రుసుము తీసుకొస్తే ఏదైనా ఎక్సైజ్ స్టేషన్ నుంచి కూడా ఆన్‌లైన్‌లో అప్లికేషన్ పెట్టేలా చూస్తామని అధికారులు పేర్కొన్నారు. కానీ తొలి మూడు రోజుల పాటు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వ్యాపారుల వివరాలను కనుక్కున్న టీడీపీ నేతలు, వాళ్లను భయభ్రాంతులకు గురిచేశారు. తీరా ఆన్‌లైన్‌లో వివరాలు ఎవరికీ కనిపించకుండా రాష్ట్ర ఎక్సైజ్ యంత్రాంగం చర్యలు తీసుకోవడంతో, స్టేషన్‌కు ఎవరెవరు వస్తున్నారో అని ఆరాతీస్తూ హెచ్చరికలు జారీ చేస్తున్నారు. 104 దుకాణాలకు అధికారులు ఇచ్చిన నోటిఫికేషన్ ప్రకారం ఇప్పటి వరకు కనీసం 400 పైచిలుకు దరఖాస్తులు వచ్చి ఉండాలి. ఈ లెక్కన ప్రభుత్వానికి అప్లికేషన్ల రూపంలోనే రూ.4 కోట్ల ఆదాయం సమకూరి ఉండాల్సింది. దరఖాస్తు చేసుకుని చివరి రోజుకు ఒక్కో దుకాణానికి సగటున పది దరఖాస్తుల చొప్పున రూ.10 కోట్ల ఆదాయం రావాల్సింది. కానీ ఇప్పటి వరకు 324 దరఖాస్తులు వచ్చినట్లు తెలుస్తోంది. అసలు 27 దుకాణాలకు ఒక్క దరఖాస్తు కూడా రాలేదని విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. మద్యం దుకాణాల్లో తాము మాత్రమే సంపాదన వెతుక్కోవాలని కొందరు అధికారపార్టీ ఎమ్మెల్యేలు రంగంలోకి దిగితే, మరికొన్నిచోట్ల వారి అన్నదమ్ములు, తండ్రి, కుటుంబ సభ్యులు లిక్కర్ వ్యాపారంలోకి అడుగు పెడుతూ ఇతరుల్ని బెదిరింపులకు గురిచేస్తున్నారు.

రేపే ఆఖరు..

ఇక దరఖాస్తు చేసుకోవడానికి ఈనెల 9వ తేదీ సాయంత్రంతో గడువు ముగియనుంది. ఆఖరు రోజు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు పెద్ద ఎత్తున వస్తే సర్వర్ పనిచేయక సాంకేతిక సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. వీలైనంత వరకు మంగళవారమే 90 శాతం దరఖాస్తులు వేయించాలని ఎక్సైజ్ అధికారులు భావిస్తున్నారు. గతంలో ఉన్న పరిచయాలతో పాత వ్యాపారుల్ని స్టేషన్‌కు పిలిపించి దరఖాస్తు చేయమని ప్రాధేయపడుతున్నారు. తీరా నియోజకవర్గాల్లో ఎదురవుతున్న బెదిరింపులు తెలుసుకుని అధికారులు మౌనం వహి స్తున్నారు. ఈ నెల 11న చిత్తూరులోని షుగర్ ఫ్యాక్టరీ కల్యాణ మండపంలో లాటరీ పద్ధతిలో దుకాణాల కేటాయిస్తారనేది చర్చనీయాంశం.

సిండి'కేట్'కు ప్రాణం



చిత్తూరు రూరల్ ఎక్సైజ్ స్టేషన్‌లో దరఖాస్తు చేస్తున్న వ్యాపారులు

మార్కెట్‌లో రూ.10 పలికే వస్తువును, అక్కడున్న వ్యాపారులంతా కలిసి కట్టుగా రూ.12 విక్రయించడాన్నే సిండికేట్ అంటారు. అంటే రూ.99 పలికే క్వార్టర్ చీప్‌లిక్కర్‌ను రూ.120 వరకు విక్రయించాలని ఇప్పటికే కొందరు వ్యాపారులతో టీడీపీ నేతలు డీల్ కుదుర్చుకుని సిండికేట్‌కు ప్రాణం పోశారు. దీని ఫలితమే జిల్లాలో 27 దుకాణాలకు ఒక్క దరఖాస్తు కూడా పడనీయకుండా చేసింది. వీటికి ఎవరు దరఖాస్తు చేయాలో ఇప్పటికే అధికారపార్టీ ఎమ్మెల్యేలు కొందరు, ఇతర టీడీపీ నేతలు నిర్ణయించేశారు. ఇక 39 దుకాణాలకు సింగిల్ దరఖాస్తులు పడ్డాయి. అంటే లాటరీలో ఎవరికి దుకాణాలు రావాలో సిండికేట్ నడిపించే అధికారపార్టీ నేతలు నిర్ణయించేశారు. సిండికేట్‌లో కూడా సింహభాగం లాభాలు తమకు దక్కాల్సిందేనని, ఎన్నికల్లో రూ.కోట్లు పోసి గెలిస్తే ఆ మాత్రం లాభం రాకుంటే తాము నష్టపోతామని కొందరు ప్రజా ప్రతినిధులు బహిరంగంగానే మాట్లాడుతున్నారు. వచ్చే లాభంలో 70 శాతం నేతలకు 30 శాతం వ్యాపారులకు అన్నట్లు నిర్ణయించారు. వ్యాపారులకు వచ్చే లాభాల్లోనే ఎక్సైజ్, పోలీసుశాఖ మామూళ్లు చూసుకోవాలని హుకుం జారీ చేశారు. నూతన మద్యం పాలసీ ప్రభుత్వానికి ఆదాయం తెచ్చినా ఒకటే.. శాసనాలు చేసే తమకు ఆదాయం వచ్చినా ఒక్కటే అన్నట్టు కొందరు అధికార పార్టీ ప్రజాప్రతినిధుల వ్యవహారశైలి నడుస్తోంది.

క్లుప్తంగా

పిడుగుపాటుకు వృద్ధురాలు మృతి


మృతి చెందిన నారాయణమ్మ

పుత్తూరు: మండలంలోని సీతారామాపురం పంచాయతీ పరిధిలోని మేదర మిట్ట గ్రామంలో సోమవారం ఉదయం పిడుగుపాటుకు వృద్ధురాలు మృతి చెందింది. గ్రామస్తుల కథనం మేరకు ఉదయం 10 గంటల సమయంలో మేదరమిట్టకు చెందిన నారాయణమ్మ(65) మేకలను మేతకు సమీప గుట్ట ప్రాంతానికి తోలుకెళ్లింది. కొంత సేపటికి ఉరుములతో కూడిన వర్షంతో పాటు నారాయణమ్మ పక్కనే పిడుగు పడడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలికి ముగ్గురు కుమారులు ఉన్నారు. ఈ మేరకు వీఆర్‌ఓ నాగరాజు గ్రామానికి వెళ్లి వివరాలను సేకరించి తహసీల్దారుకు నివేదించారు.

పోలీసు కుటుంబాలకు ఆర్థికసాయం


బాధితులకు చెక్కు అందజేస్తున్న ఎస్పీ మణికంఠ

చిత్తూరు అర్బన్: చిత్తూరు పోలీసుశాఖకు చెందిన కుటుంబాలకు ఎస్పీ మణికంఠ సోమవారం ఆర్థిక సాయం అందచేశారు. చిత్తూరులోని జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో, బైరెడ్డిపల్లె పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తూ గత నెల మృతి చెందిన హెడ్ కానిస్టేబుల్ చలపతి కుటుంబానికి డెత్ రిలీఫ్ ఫండ్ నుంచి రూ.లక్ష చెక్కును అందజేశారు. వెదురుకుప్పంలో పనిచేస్తూ మృతి చెందిన హెడ్‌కానిస్టేబుల్ సుదర్శన్ రాజు కుటుంబానికి రూ.లక్ష అందజేశారు. ఇబ్బందుల్లో ఉన్న పోలీసు కుటుంబాల సంక్షేమానికి అండగా ఉంటామని ఎస్పీ హామీ ఇచ్చారు. పోలీసు సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఉదయ్‌కుమార్ ఉన్నారు.

శిలాఫలకంలో ప్రొటోకాల్ ఉల్లంఘన

- 5న ప్రారంభమైన తహసీల్దార్ కార్యాలయం
- పాత భవనానికి రంగులు వేసి పునర్నిర్మాణమంటూ గొప్పలు
- శిలాఫలకంలో టీడీపీ నేత పేరు...
- భగ్గుమంటున్న అధికార పార్టీ నేతలు
- కలెక్టర్ ఎలా ప్రారంభిస్తారని ప్రశ్నల వర్షం

సాక్షి టాస్క్‌ఫోర్స్: చిత్తూరులో మండల తహసీల్దార్ కార్యాలయ శిలాఫలకం విమర్శలకు దారితీస్తోంది. ఈ నెల 5వ తేదీ కార్యాలయం ప్రారంభోత్సవం కాగా.. పాత భవనానికి రంగులు వేసి టీడీపీలోని ఓ వర్గం పునర్నిర్మించినట్లు ప్రచారం చేసుకుంటోంది. టీడీపీ నేత సొంత ఖర్చుతో కలరింగ్ ఇచ్చుకుని దంపతుల పేర్లతో కార్యాలయ గోడకు శిలాఫలకం వేయించుకున్నాడు. దీంతో ఆ పార్టీ నేతలే ఆ ఫలకంపై భగ్గుమంటున్నారు. ప్రొటోకాల్ పాటించని అధికారుల తీరుపై మండిపడుతున్నారు. టీడీపీ నేతతో శిలాఫలకం ఉంటే కలెక్టర్ ఎలా ప్రారంభించారని ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు. ఇంతకీ ఆ శిలాఫలకం ఏమిటో...ఆ నేత ఎవరో చూద్దాం...

చిత్తూరు నగర, మండలానికి కలిపి మిట్టూరులోని తహసీల్దార్ కార్యాలయం ఒకటే ఉండేది. పరిపాలన సౌలభ్యం కోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అర్బన్, రూరల్ మండలాలకు వేరువేరుగా తహసీల్దార్ కార్యాలయాలు ఉండాలని అప్పట్లో నిర్ణయం తీసుకుంది. 2022లో మండల తహసీల్దార్ కార్యాలయం విభజనకు ప్రభుత్వం నుంచి గ్రీన్‌సిగ్నల్ లభించింది. తొలుత రెవెన్యూ గ్రామాలను విభజించారు. ఆ నివేదికలను ప్రభుత్వానికి పంపారు. ఆ తర్వాత కార్యాలయాన్ని బీఎస్‌ఆర్‌పేటలో ఏర్పాటు చేయాలని చూశారు. అయితే అది అనుకూలమైన ప్రాంతం కాదని భావించి అధికారులు జెడ్పీ వెనుక భాగంలో ఉన్న పాత జిల్లా పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసే యోచనలో పడ్డారు. ఆ భవనం శిథిలావస్థలో ఉందని భావించి పాత కలెక్టరేట్‌లోని మైనింగ్ శాఖ భవనాన్ని ఖరారు చేశారు. చిన్న చిన్న మరమ్మతులతో పాటు పెయింటింగ్ పనులు చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేశారు. ఇంతలో ఎన్నికలు రావడంతో ఆ కార్యాలయం ప్రారంభానికి నోచుకోలేదు. నెల రోజుల క్రితం మండలానికి సంబంధించిన కొంత మంది నాయకులు ఆ భవనం వద్దని, పాత ఆర్డీఓ కార్యాలయంలో మండల తహసీల్దార్ కార్యాలయ నిర్వహణకు అనుమతి ఇవ్వాలని జిల్లా అధికారులకు విన్నవించుకున్నారు.

ఇదంతా ఎందుకు చేస్తున్నట్లో..

గతంలో మాజీ ఎంపీపీ, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా చంద్రప్రకాష్ వ్యవహరించారు. 2015లో ఆయన భార్య గీర్వాణీ చిత్తూరు జెడ్పీటీసీగా గెలిచి జెడ్పీ చైర్‌పర్సన్‌గా ఎంపికయ్యారు. 2019 ఎన్నికల తర్వాత చంద్రప్రకాష్ మండలానికి చాలా దూరమయ్యారు. ఆ ఐదేళ్ల పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు కష్టాల్లో ఉన్నా పట్టించుకోకుండా వదిలేశారు. ఆయన ఈసారి ఎన్నికల సమయంలో తళుక్కుమనే సరికి ఆ పార్టీలోని కొందరు నాయకులు, కార్యకర్తలు పూర్తిగా వ్యతిరేకించారు. అధికారంలోకి వచ్చే సరికి మళ్లీ జెడ్పీటీసీ సీటు తెచ్చుకోవాలనే పట్టులో ఉన్నారు. జెడ్పీటీసీగా గెలిచి జెడ్పీ కుర్చీని సొంతం చేసుకునే పనిలో పడ్డారు. ఇందులో భాగంగానే మండలానికి అన్నీ తానై చేస్తున్నట్లు చూపించుకుంటున్నారని టీడీపీలోని మరో వర్గం కోడైకూస్తోంది. ఇక మండలంలోని మరో బలమైన నాయకుడు సైతం జెడ్పీ పీఠం కోసం ఇప్పటి నుంచే గట్టి ప్రయత్నాల్లో ఉన్నారని ఆ వర్గం బహిరంగంగా చెప్పుకుంటుండడం గమనార్హం.

రంగులు వేసి...శిలాఫలకం పాతేశారు


చిత్తూరు తహసీల్దార్ కార్యాలయం

చిత్తూరు నూతన ఆర్డీఓ కార్యాలయం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే ప్రారంభమైంది. దీంతో పాత ఆర్డీఓ కార్యాలయ భవనం ఖాళీగా ఉంది. మండల ప్రజల అభ్యర్థన మేరకు ఈ కార్యాలయాన్ని తాత్కాలిక మండల తహసీల్దార్ కార్యాలయ నిర్వహణకు అనుమతులొచ్చాయి. ఈ భవన నిర్మాణం బ్రిటిష్ వారి కాలంలో నిర్మించారని పెద్దలు చెబుతుంటారు. ఇప్పటికీ చెక్కుచెదరకుండా ఉంది. అయితే ఓ టీడీపీ నేత ఆ భవనానికి సొంత ఖర్చులతో రంగులు వేయించాడు. ఇదే అదునుగా చేసుకుని భవనాన్ని పునర్నిర్మాణం చేపట్టినట్లు కార్యాలయ భవన గోడకు శిలాఫలకం పాతేశారు.

శిలాఫలకంలో టీడీపీ నేత పేరేంటి?

శిలాఫలకంలో ఎమ్మెల్యే, రెవెన్యూ శాఖ మంత్రి, ఎంపీ, మేయర్ ఎమ్మెల్సీ, కలెక్టర్ పేర్లు ముద్రించారు. కానీ జెడ్పీటీసీ, ఎంపీపీ పేర్లను దూరం చేశారు. ప్రొటోకాల్ పాటించకపోగా...టీడీపీ నాయకుడి పేరును శిలాఫలకంలో ముద్రించడంపై విమర్శలకు తావిస్తోంది. భవన పునర్నిర్మాణకర్తలుగా టీడీపీ నేత చంద్రప్రకాష్, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ గీర్వాణీ పేరును ఎలా వేస్తారంటూ టీడీపీలోని కొంత మంది నాయకులు మండిపడుతున్నారు. టీడీపీ నాయకుడి పేరుతో ఉన్న శిలాఫలకాన్ని కలెక్టర్ ఎలా ప్రారంభిస్తారంటూ ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు. వేలాది రూపాయలు ఖర్చు చేసి లక్షలాది రూపాయలు ఖర్చు చేసినట్లు శిలాఫలకం వేసుకోవడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సీఎం క్యాంపు కార్యాలయానికి, రెవెన్యూశాఖ మంత్రికి ఈ శిలాఫలకం ఏర్పాటుపై సొంత పార్టీ నేతలే ఫిర్యాదు చేయనున్నారు.


మండల తహసీల్దార్ కార్యాలయ శిలాఫలకం

కుట్టుమిషన్ల పంపిణీ

చిత్తూరు కలెక్టరేట్ : మహిళలకు కుట్టుమిషన్లు అందించడం వల్ల వారు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని అసిస్టెంట్ కలెక్టర్ హిమవంశీ పిలుపునిచ్చారు. ఇరువారం వద్ద ఉన్న నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ శిక్షణా ప్రాంగణంలో సోమవారం కుట్టుమిషన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పేద మహిళలకు టైలరింగ్ శిక్షణ ఇవ్వడంతో పాటు వారికి కుట్టుమిషన్లు అందించడం అభినందనీయమన్నారు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ సీఎంజీ రఘురామ్, ఎన్ఏసీ అసిస్టెంట్ డైరెక్టర్ సతీష్ చంద్ర మాట్లాడుతూ కుట్టుమిషన్ల పంపిణీ, టైలరింగ్ నేర్పించే తరగతి గదుల నిర్మాణం కోసం ఐఓసీఎల్ దాదాపుగా రూ.18,65,000 ఖర్చు చేసిందన్నారు.

ఘర్షణ కేసులో ఇద్దరికి జైలు

చిత్తూరు అర్బన్: ఘర్షణ కేసులో ఇద్దరికి ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ స్థానిక ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి ఉమాదేవి సోమవారం తీర్పునిచ్చారు. ఏపీపీ కృష్ణారెడ్డి, కథనం మేరకు బంగారుపాళెం మండలం తుంబకుప్పానికి చెందిన మురుగేష్, వీరాస్వామి కుటుంబాల మధ్య భూతగాదాలున్నాయి. 2019 జులై 12న వీరాస్వామి కుటుంబ సభ్యులు మురుగేష్‌పై కత్తితో దాడి చేశారు. ఈ ఘటనపై మురుగేష్ బంగారుపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు వీరాస్వామి, అతని కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరిచారు. పూర్వాపరాలను పరిశీలించిన పిదప నేరం రుజువుకావడంతో నిందితులు వీరాస్వామి(62) అతని కుమారుడు చరణ్‌కుమార్(27)కు ఆరు నెలలు జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు.

విజయపురం ఎంపీడీవో ఎవరో?

- ఇన్‌చార్జి వ్యవహారంలో గందరగోళం
- రిలీవ్ ఆర్డర్ కోసం సచివాలయ సిబ్బంది పడిగాపులు

విజయపురం : ఎన్నికల అనంతరం అన్ని శాఖల్లోనూ అధికారుల బదిలీలు చోటుచేసుకున్నాయి. ఇందులో భాగంగా ఇక్కడి ఎంపీడీవోగా ఉన్న చంద్రమౌళి బదిలీపై వెళ్లిపోవడంతో ఆయన స్థానంలో ఇప్పటివరకు ఎవరినీ నియమించలేదు. ఇన్‌చార్జి ఎంపీడీఓ నియామకంలో గందరగోళం చోటుచేసుకుంది. దీంతో ఎంపీడీవో సంబంధిత వ్యవహారాలన్నీ పెండింగ్ పడ్డాయి. పరిపాలన ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నచందాన ముందుకు సాగడం లేదు. కార్యాలయ సిబ్బందితో పాటు సచివాలయ సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఇన్‌చార్జి వ్యవహారంలో గందరగోళం

గత నెల 22వ తేదీన విజయపురం ఎంపీడీవోగా చంద్రమౌళి విధుల్లో ఉన్న సమయంలోనే ఇన్‌చార్జి బాధ్యతలను విజయపురం మండల కార్యాలయ ఏవోకు అప్పగిస్తూ జెడ్పీ అధికారులు జీవో జారీ చేశారు. అయితే స్థానిక టీడీపీ నేతల ఒత్తిడితో ఆ జీవోను మార్పు చేస్తూ గత నెల 30వ తేదీన నగరి మండల పరిషత్ కార్యాలయ ఈవోపీఆర్డీకి బాధ్యతలు అప్పగిస్తూ మరో జీవో జారీచేశారు. ఈ మేరకు బదిలీపై వెళ్లే ఎంపీడీవో చంద్రమౌళి నగరి ఈవోపీఆర్డీకి బాధ్యతలు అప్పగించి వెళ్లారు. అయితే ఈవోపీఆర్డీ చిత్తూరులో ట్రైనింగ్‌లో ఉండడంతో వెంటనే బాధ్యతలు స్వీకరించలేదు. దీంతో ఆమెకు ఇచ్చిన జీవోను రద్దుచేశారు. కొత్త జీవో విడుదల చేయకుండా పాత జీవోతోనే కొనసాగాలని జెడ్పీ అధికారులు ఏవోకు మౌఖిక ఆదేశాలు ఇచ్చేశారు. అయితే 30వ తేదీ జీవో ప్రకారం నగరి ఈవోపీఆర్డీ వచ్చి తనకు బాధ్యతలు అప్పగించాలని ఆయన పట్టుబట్టారు. తనకు ఇచ్చిన జీవో ఆరోజే రద్దు చేశారు కనుక తానెందుకు బాధ్యతలు అప్పగిస్తానని నగరి ఈవోపీఆర్డీ చెప్పడంతో ఇన్‌చార్జి ఎంపీడీవో ఎవరన్నది ప్రశ్నార్థకంగా మారింది. దీంతో బదిలీపై వెళ్లే సచివాలయ సిబ్బందికి రిలీవింగ్ ఆర్డరు ఇచ్చేవారెవరూ లేక సందిగ్ధంలో పడ్డారు. రెగ్యులర్ ఎంపీడీవోను నియమించకపోవడంతోనే ఇలాంటి పరిస్థితులు నెలకొంటున్నాయని, జిల్లా యంత్రాంగం దీనిపై దృష్టి సారించాలని కోరుతున్నారు.


విజయపురం ఎంపీడీవో కార్యాలయం

గ్రామీణ ప్రగతికి ఆత్మనిర్భర్

- 180 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయానికి శ్రీకారం
- సౌరవిద్యుత్ వనరుల ఏర్పాటు
- రైతులకు ఆత్రియా ఫౌండేషన్ సహకారం

పాలసముద్రం : గ్రామీణ ప్రగతికి, ఆర్థికాభివృద్ధికి ఆత్మనిర్భర్ భారత్ తోడ్పాటునందిస్తుందని బెంగళూరుకు చెందిన ఆత్రియా ఫౌండేషన్ చైర్మన్ సుందర రాజు తెలిపారు. తిరుమళరాజుపురంలో సోమవారం ఆత్రియా యూనివర్సిటీ ఫౌండేషన్ వారు 180 ఎకరాల భూమిలో ప్రకృతి వ్యవసాయానికి శ్రీకారం చుట్టారు. సుందరరాజు మాట్లాడుతూ ఆత్రియా గ్రూప్ సాంకేతిక, ఆర్థిక వనరులతో ప్రకృతి వ్యవసాయానికి సహాయం చేస్తుందన్నారు. రైతులందరితో కలసి మట్టిని పునరుత్తేజం చేసే, అడవులను సృష్టిస్తామన్నారు. అక్కడ 70 ఎకరాల స్థలాన్ని ఒక గరిష్ఠ ఉత్పత్తి వ్యవసాయ భూమిగా మార్చుతామని పేర్కొన్నారు. ఇది ఎకరానికి నెలకు రూ.3 లక్షల కంటే ఎక్కువ ఆదాయాన్ని సాధించి పెడుతుందన్నారు. ఈ స్థలం రైతుల జీవనోపాధిని పునరుజ్జీవం చేస్తుందని చెప్పారు. ఆత్రియా ఫౌండేషన్ జాయింట్ సెక్రటరీ, మినిస్టరీ ఆఫ్ ఎర్త్ సైన్స్ ఎస్ గోపాలక్రిష్ణ మాట్లాడుతూ రైతులు శక్తివంతమైన ఉత్పత్తిదారులుగా మారేందుకు అవసరమైన సౌరశక్తి వనరులను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. నందన గ్రూప్ చైర్మన్ రవిచంద్రన్ మాట్లాడుతూ వ్యవసాయంలో ఆరోగ్యం పుష్కలంగా ఉంటుందని చెప్పారు. ప్రకృతి వ్యవసాయంలో ఖర్చు తక్కువ ఆదాయం ఎక్కువ ఉంటుందని, దీంతోపాటు ఆరోగ్యకరమైన పంట ఉత్పత్తులు చేసుకోవచ్చని తెలిపారు.


విద్యార్థులకు ట్యాబ్ పంపిణీ చేస్తున్న ఆత్రియా ఫౌండేషన్ యూనివర్సిటీ ప్రతినిధులు

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

తిరుమళరాజుపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఆత్రియా ఫౌండేషన్ యూనివర్సిటీ వెబ్ సీఈఓ శ్రీకాంత్ గణేష్ విద్యార్థులకు 70 ట్యాబ్‌లు అందించారు. రూ.25 వేలు ఒక్కొక్క ట్యాబ్ ఉంటుంది. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం మారుతున్న తరుణంలో విద్యార్థులు ట్యాబ్‌ల ద్వారా పాఠాలు చేర్చుకోవడం వల్ల సమాజంలో ఉన్నత స్థాయికి ఎదిగే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా క్షత్రియ సంఘం అధ్యక్షుడు గరిరాజు, వెల్ నెట్స్ ఎండీ చంద్రశేఖర్ రాజు, ఆత్రియా ఫౌండేషన్ నిర్వాహకులు గంగరాజు, బాలరాజు ఆత్రియా ఫౌండేషన్ యూనివర్సిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

మా మొర ఆలకించండి సారూ !

చిత్తూరు కలెక్టరేట్ : మా మొర పట్టించుకోండి సారూ అంటూ జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు కలెక్టర్‌ను వేడుకున్నారు. కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. అర్జీలు స్వీకరించిన కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను సకాలంలో పరిష్కరించాలన్నారు. వివిధ శాఖలకు సంబంధించి 127 అర్జీలు నమోదైనట్లు కలెక్టరేట్ ఏఓ కులశేఖర్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌ఓ పుల్లయ్య, చిత్తూరు ఆర్డీఓ శ్రీనివాసులు అర్జీలు స్వీకరించగా, పలు శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

జీతాలు మంజూరు చేయించండి

జిల్లా సమగ్ర శిక్ష కార్యాలయం, క్షేత్రస్థాయిలో మండలాల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి రెండు నెలల జీతాలు ఇప్పించాలని సమగ్రశిక్ష కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల ఫెడరేషన్ జేఏసీ నాయకులు కోరారు. ఈ మేరకు ఆ ఫెడరేషన్ నాయకులు సోమవారం కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఆ ఫెడరేషన్ జిల్లా చైర్మన్ కృష్ణమూర్తి, కార్యదర్శి విల్వనాథం మాట్లాడుతూ విద్యాశాఖ, సమగ్రశిక్ష శాఖ పరిధిలో ప్రతి పథకాన్ని క్షేత్రస్థాయిలో పకడ్బందీగా అమలు చేసేందుకు కృషి చేస్తుంటామన్నారు. జీతాన్ని నమ్ముకుని విధులు నిర్వహిస్తున్న తమకు అన్యాయం చేయడం బాధాకరమన్నారు. ప్రతి నెలా తమకు ఒకటో తేదీన జీతం ఇచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఆ సంఘ నాయకులు గిరిధర్, నంద, ప్రసాద్, లత, యమున, హరిప్రసాద్, దేవరాజు, సుధ పాల్గొన్నారు.


ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ ఉద్యోగులు

మెయిన్ సెంటర్లుగా మార్చాలి

జిల్లాలోని మినీఅంగన్‌వాడీ సెంటర్లను మెయిన్ సెంటర్‌లుగా మార్చాలని ఏపీ అంగన్ వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు లలిత డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆ సంఘం నాయకులు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అంగన్‌వాడీ కార్యకర్తలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. జిల్లా ప్రాజెక్టులో ఉన్న సమస్యల పరిష్కారం కోసం జిల్లా సమన్వయ కమిటీ సమావేశం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి షకీల మాట్లాడుతూ అధికారులకు విన్నవించినా స్పందించకపోవడంతో ఈ ధర్నా చేయాల్సి వచ్చిందన్నారు.

అతివేగమే రోడ్డు ప్రమాదాలకు కారణం

పలమనేరు: పట్టణ సమీపంలోని మొగిలి ఘాట్‌లో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలకు కారణం డ్రైవర్ల నిర్లక్ష్యం, అతివేగమేనని జనవిజ్ఞాన వేదిక నాయకులు పేర్కొన్నారు. కొంతకాలంగా మొగిలి ఘాట్‌లో జరిగిన పలు రోడ్డు ప్రమాదాల్లో 30 మంది వరకు మృతిచెందారు. దీనికి కారణం భూతాలు, కొరివిదెయ్యాలు, అక్కడ సంచరిస్తున్న ఆత్మలంటూ కొందరు సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారు. వీటిని ఖండించేందుకు స్థానిక జేవీవీ నేతలు పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో సోమవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ నేటి కంప్యూటర్ యుగంలో సైన్సు ఇంత అభివృద్ధి చెందినా ఇంకా ఇలాంటి మూఢ నమ్మకాలను ప్రచారం చేయడం మంచిదికాదన్నారు. కలెక్టర్ చెప్పిన సూచనలను అమలు చేస్తే ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. ఇందులో జేవీవీ నాయకులు గిరిధర్‌మూర్తి, సుదర్శనాచారి, పీసీబాబు, పుష్పరాజ్, సీతారామయ్య, యశ్వంత్, లైబ్రేరియన్ హేమంత్‌కుమార్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జేవీవీ నాయకులు

తూటాలు పేలి ఇద్దరికి తీవ్ర గాయాలు

పుంగనూరు: మండలంలోని వనమలదిన్నె రోడ్డులో ఉన్న బోడిబండ క్వారీలో సోమవారం సాయంత్రం నాటుమందు తూటాలు పేలి ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. బోడిబండ క్వారీని మేకంజామనపల్లెకు చెందిన నరేంద్రబాబు నిర్వహిస్తున్నారు. క్వారీలో షెడ్లు వేసేందుకు పట్టణానికి చెందిన ఇక్బాల్‌బాషా(34), ఆసిఫ్‌బాషా(18) ను వెల్డింగ్ పనులకు తీసుకెళ్లారు. షెడ్లు వేస్తుండగా ఒక్కసారిగా నల్లమందు తూటాలు పేలడంతో క్వారీ ప్రాంతం దద్ధరిల్లిపోయింది. నాటు తూటాలకు షెడ్లు, బ్యాటరీలు, ఒక్కసారిగా ఎగిరిపడ్డాయి. పనులు చేస్తున్న వారికి సుమారు నలుగురికి గాయాలయ్యాయి. వీరిలో ఇక్బాల్, ఆసిఫ్‌బాషాలకు తీవ్ర గాయాలు కావడంతో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ఇద్దరిని తిరుపతికి తరలించారు. సంఘటన స్థలాన్ని పలమనేరు డీఎస్పీ ప్రభాకర్, సీఐ శ్రీనివాసులు సందర్శించారు. పేలుళ్లపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. వెల్డింగ్ కార్మికుల సంఘం ప్రతినిధులు బాషు, చాంద్‌బాషా ఆధ్వర్యంలో సంఘటన స్థలాన్ని సందర్శించి, బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. క్వారీలో సోలార్ బ్యాటరీలు పేలాయని నిర్వాహకులు తెలపడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. క్వారీలో నాటు మందు తూటాలు పేలడంతో రాళ్లు ఎగిరిపడ్డాయని, ఆ పేలుళ్లకు పాత షెడ్లు, కొత్త షెడ్లు, జనరేటర్‌తో సహా ధ్వంసమయ్యాయని తెలిపారు. నిజానిజాలు పోలీసుల దర్యాప్తులో వెల్లడి కావాల్సి ఉంది.


గాయపడిన వెల్డర్ ఇక్బాల్‌బాషా

జిల్లాలో వీఆర్‌ఓల బదిలీలు

చిత్తూరు కలెక్టరేట్: జిల్లా వ్యాప్తంగా భారీ స్థాయిలో విలేజ్ రెవెన్యూ ఆఫీసర్ (వీఆర్‌ఓ)లను బదిలీలు చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ ఉత్తర్వులు జారీచేశారు. జిల్లా వ్యాప్తంగా 7 అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ గ్రేడ్-1, గ్రేడ్-2 వీఆర్వోలను బదిలీ చేశారు. గ్రేడ్ 1 కేడర్ వీఆర్‌ఓలను 240 మంది, గ్రేడ్ 2 కేడర్‌లో 125 మంది మొత్తం 365 మంది వీఆర్‌ఓలను బదిలీ చేశారు. బదిలీ అయిన వీఆర్‌ఓలు వెంటనే కొత్త స్థానాల్లో విధుల్లో చేరాలని, లేకుంటే చర్యలు తప్పవని కలెక్టర్ ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ బదిలీలతో గ్రామ రెవెన్యూ శాఖలో ప్రక్షాళనకు శ్రీకారం చుట్టినట్లు తెలుస్తోంది.

జెడ్పీటీసీ సభ్యుడి అరెస్టు

రొంపిచెర్ల: మద్యం కేసులో రొంపిచెర్ల జెడ్పీటీసీ సభ్యుడు చిచ్చిలి రెడ్డీశ్వర్ రెడ్డిని అరెస్టు చేసినట్లు ఏఎస్ఐ మధుసూదన్ తెలిపారు. ఏఎస్ఐ కథనం మేరకు, జెడ్పీటీసీ రెడ్డీశ్వర్ రెడ్డి ఇంటి వద్ద సోమవారం మధ్యాహ్నం అట్టబాక్స్‌లో మద్యం బాటిళ్లు ఎత్తుకుని ఉండగా గుర్తించామని తెలిపారు. బాక్సులో రూ.6000 విలువ చేసే 30 మద్యం బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. మహిళా పోలీస్ జ్ఞాన ప్రసూన ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

'ద్రవిడ' పాలన అస్తవ్యస్తం

- హైకోర్టు ఉత్తర్వుల మేరకు లైబ్రేరియన్ నియామకంపై విచారణ
- వర్గ విభేదాలతో భ్రష్టుపడుతున్న వర్సిటీ ప్రతిష్ట
- రోజురోజుకూ తగ్గుతున్న విద్యార్థుల సంఖ్య
- ఇంజనీరింగ్ శాఖలో అడ్డగోలుగా పదోన్నతులు

కుప్పం: ద్రవిడ భాషల పరిశోధన కేంద్రంగా ఏర్పడిన ద్రవిడ విశ్వ విద్యాలయంలో పాలనా వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. లైబ్రరీ, ఇంజనీరింగ్ విభాగంలో పదోన్నతులు కల్పించడంపై హైకోర్టు ఏసీబీ అధికారులతో కమిటీ నియమించి విచారణకు ఉత్తర్వులు జారీ చేసింది. 18 శాఖలుంటే కేవలం 5 శాఖల్లో మాత్రమే విద్యార్థులున్నారు. ద్రవిడ భాషల పరిశోధన విభాగాలు పూర్తిగా పనిచేయడం లేదు. నాన్‌టీచింగ్ ఉద్యోగులకు సక్రమంగా జీతాలు ఇవ్వలేదని రోడ్డెక్కారు. 3 వేలమందికి పైగా విద్యార్థులతో కళకళలాడే వర్సిటీ నేడు 350 మంది విద్యార్థులకే పరిమితమైంది.

లైబ్రేరియన్ నియామకంపై ఏసీబీ విచారణ

ద్రవిడ వర్సిటీలో లైబ్రేరియన్ నియామకంపై వివాదం చోటుచేసుకుంది. గతంలో లైబ్రేరియన్‌గా ఉన్న దొరస్వామిని ఇన్‌చార్జి వైస్ చాన్సలర్‌గా నియమించారు. ఆయన స్థానంగా అసిస్టెంట్ లైబ్రేరియన్‌గా ఉన్న నరేష్‌కు పదోన్నతి కల్పించారు. అయితే నకిలీ ప్రతాలు సృష్టించి పదోన్నతులు కల్పించారంటూ వర్సిటీలో పనిచేస్తున్న ఉద్యోగులు లోకాయుక్తను ఆశ్రయించారు. లోకాయుక్తలో లైబ్రేరియన్‌గా పదోన్నతులు కల్పించడాన్ని తప్పుపట్టింది. పదోన్నతిపై లైబ్రేరియన్‌గా పదోన్నతి పొందిన నరేష్ లోకాయుక్త తీర్మానంపై హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ చేయాలంటూ హైకోర్టు ఏసీబీ అధికారులను ఆదేశించింది. దీంతో వారు వర్సిటీలో విడతలవారీగా విచారణ చేపడుతున్నారు.

మరోవైపు ఇంజనీరింగ్ విభాగంలో ఇష్టానుసారంగా పదోన్నతులు కల్పిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. గతంలో డిప్యూటీ ఇంజనీర్‌గా ఉన్న అనిల్ కుమార్‌ను తప్పించి, ఎస్టేట్ ఆఫీసర్‌గా ఉన్న రఘుపతికి డిప్యూటీ ఇంజనీర్‌గా పదోన్నతి కలిపించారు. ఈ నెల 3వ తేది అనిల్ కుమార్‌ను తప్పించటం, 5వ తేదీ ఉదయం రఘుపతికి డీఈగా పదోన్నతి ఇవ్వడంపై పలు విమర్శలు వస్తున్నాయి.



5 శాఖల్లో మాత్రమే విద్యార్థులు

వర్సిటీ ప్రాగణంలో 18 శాఖల్లో 3 వేల మంది పైగా విద్యార్థులుండేవారు. ప్రస్తుతం వర్సిటీలో 5 శాఖల్లో 350 మంది మాత్రమే చదువుతున్నారు. వర్సిటీలో బయోటెక్నాలజీ, కంప్యూటర్ సైన్స్, సెమిస్టరీ, ఇంగ్లీష్, తమిళం భాషా పరిశోధన కోర్సుల్లో మాత్రమే విద్యార్థులున్నారు. మిగిలిన 13 డిపార్టుమెంట్లు ఖాళీ అయ్యాయి.

రోడెక్కనున్న నాన్ టీచింగ్ సిబ్బంది

ద్రవిడ వర్శిటీలో 289 మంది నాన్ టీచింగ్ స్టాఫ్ వివిధ శాఖల్లో పనిచేస్తున్నారు. ప్రస్తుతం 13 డిపార్టుమెంట్లు ఖాళీ అయ్యాయి. అయితే రూ.2.63 కోట్లు విడుదల చేసినట్లు కూటమి ప్రభుత్వం ఒక జీఓను విడుదల చేసింది. కానీ ఇప్పటివరకు జీతాలు రాకపోవడంతో ఆందోళనకు సిద్ధం అవుతున్నారు.